సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ప్రజావాణికి 51 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 51 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలు తమ సమస్యలపై అధికారులకు అర్జీలు అందించారు.

- 8లో ▸



పోలీసుల బదిలీలు

జిల్లాలోని పలువురు పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.5 /21.7



న్యూస్‌రీల్

చేప పిల్లల సైజు తగ్గొద్దు

నిజామాబాద్ అర్బన్ : చెరువుల్లో విడుదల చేసే చేప పిల్లల సైజు తగ్గకుండా పంపాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మరిన్ని చేప పిల్లల విత్తనాలు తెప్పిస్తామన్నారు. ఆయా చెరువుల్లో చేప పిల్లలను వదిలే ముందు మత్స్యకారులకు సమాచారం అందించాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వివరాలను ఆరా తీశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో తపస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 317 జీవో ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు పంపాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, బట్టు బద్రీనాథ్, నాయకులు వరప్రసాద్, కీర్తి, సుదర్శన్, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లావ్యాప్తంగా పశువులకు మంగళవారం నుంచి నవంబర్ 14 వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 2.52 లక్షల పశువులకు ఐదో విడత కింద గాలికుంటు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టీకా మందులను మండలాలకు సరఫరా చేసినట్లు తెలిపారు.

నేడు కళోత్సవ్ పోటీలు

నిజామాబాద్ అర్బన్ : మండల స్థాయి కళోత్సవ్ పోటీలు మంగళవారం నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంఈవోలు ఆయా మండల పరిధిలో పోటీలు నిర్వహించాలని సూచించారు. ఇందులో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు నిజామాబాద్‌లోని బాలభవన్‌లో ఉంటాయన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నిజామాబాద్ అర్బన్: ఓయూ పరిధిలోని ప్రొఫెసర్ జి రామ్‌రెడ్డి దూరవిద్య కేంద్రంలో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు నవంబర్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్ర సమన్వయకర్త రాము (9912670252)ను సంప్రదించాలని ఆయన తెలిపారు.





నగరంలో అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న జగన్మాతకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లీ మార్కండేయ మందిరం వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర సోమవారం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అమ్మవారికి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వివిధ వేషధారణలో పలువురు అలరించారు. శోభాయాత్రను తిలకించడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు.

– నిజామాబాద్ రూరల్

అడ్డగోలుగా ఫీజుల దందా

- అక్రమ మార్గంలో ప్రవేశాల ప్రక్రియ
- 'దోస్త్' ద్వారా నిశిత సంస్థలోని ఓ కాలేజీలో చేరిన విద్యార్థులు అటానమస్ కళాశాలకు బదలాయింపు
- స్వయం ప్రతిపత్తి చూపించి ఇష్టం వచ్చినట్లు ఫీజుల వసూలు
- అధ్యాపకుల అర్హతలు చూస్తే అటానమస్ ఎలా ఇచ్చారంటూ ముక్కున వేలేసుకునే పరిస్థితి
- గతంలో తనిఖీలు చేసి ఒక్కరోజులో మాట మార్చిన తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్



కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఈ నిశిత కాలేజీ నుంచి విద్యార్థులను అటానమస్ కాలేజీకి బదలాయించారు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కనీస సౌకర్యాలు, కచ్చితమైన ప్రమాణాలు లేకున్నప్పటికీ అటానమస్ హోదా తెచ్చుకున్న నిజామాబాద్ నగరంలోని నిశిత కళాశాల ఫీజుల దందాతో విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కో కోర్సుకు సంబంధించి సాధారణంగా తీసుకోవాల్సిన ఫీజుల కంటే మూడు రెట్లు అదనంగా వసూలు చేస్తుండడం గమనార్హం. పార్కింగ్ మొదలు, గ్రంథాలయం, ఆటస్థలం, తరగతి గదులు సక్రమంగా లేకున్నప్పటికీ భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విషయమై అటానమస్ అంటేనే వీళ్లకు ఓ ఆటలాగా మారిందని విద్యాభిమానులు అంటున్నారు. ఈ కథలో మరో ట్విస్ట్ నెలకొంది. డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన 'దోస్త్' ప్రవేశాలను సైతం అపహాస్యం చేయడం విశేషం. వివరాల్లోకి వెళితే.. 'దోస్త్' అడ్మిషన్ల విషయమై ఈ కళాశాల ఇష్టారాజ్యంగా వ్యవహరించడం చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. నిజామాబాద్‌లో నిశిత కామర్స్ కాలేజీ పేరుతో ఈ యాజమాన్యం మరో విద్యాసంస్థ నిర్వహిస్తోంది. అయితే అటానమస్ కళాశాలను అడ్డం పెట్టుకుని, గత రెండేళ్లుగా ఉన్నత విద్యామండలి అండదండలతో తెలంగాణ యూనివర్శిటీని సైతం తప్పుదోవ పట్టిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా గత విద్యా సంవత్సరంలో 22 మంది విద్యార్థులు 'దోస్త్' ద్వారా నిశిత కామర్స్ కళాశాలలో అడ్మిషన్లు పొందారు. అయితే వెబ్‌సైట్‌లో మాత్రం సున్నా (0) అడ్మిషన్లు అయినట్లు చూపించారు. సదరు విద్యార్థుల నుంచి తమను అటానమస్ కళాశాలకు మార్చాలని కోరుతూ లేఖలు రాయించుకుని తెలంగాణ యూనివర్సిటీకి అందించారు. ఆ విధంగా విద్యార్థుల బదలాయింపు సాధ్యం కాదని తెయూ రిజిస్ట్రార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ తిరస్కరించారు. అయినప్పటికీ ఉన్నత విద్యామండలి ద్వారా గుట్టు చప్పుడు కాకుండా బదలాయించుకోవడం విశేషం. కాగా అటానమస్ కళాశాలలో వసూలు చేసే ఫీజులు తమ శక్తికి మించిన భారమని విద్యార్థులు తెలంగాణ వర్సిటీని ఆశ్రయించారు. అయితే ఈ పరిస్థితుల్లో తాము ఏమీ చేయలేమని వర్సిటీ అధికారులు చెప్పినట్లు తెలిసింది. ఈ ఏడాది సైతం అనుబంధ గుర్తింపు తీసుకొని అలాంటి జిమ్మిక్కు ప్రదర్శించి అడ్మిషన్లు దారి మళ్లించినట్లు సమాచారం.

- నిశిత కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్, అటానమస్ ఇచ్చేవిధంగా తనిఖీలు చేసి పాజిటివ్‌గా రిపోర్ట్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.
- 20 సెక్షన్లు నిర్వహిస్తున్న ఈ కళాశాలలో దాదాపు 70 మంది అధ్యాపకులు డిగ్రీకి బోధిస్తున్నట్టు చూపారు. వీరికి తోడు మరికొంత మందిని పార్ట్ టైమ్/విజిటింగ్ ఫ్యాకల్టీ కింద చూపారు. అర్హతలను పరిశీలిస్తే ఏడుగురికి మాత్రమే పీహెచ్‌డీ ఉంది. మిగతా వారంతా పీజీ అర్హత ఉన్నవారు కావడం గమనార్హం. పరిశోధనలు, పరిశోధన పత్రాలు ఎప్పటికప్పుడు ఎంత మంది అప్‌గ్రేడ్ అవుతున్నారన్నది ఎక్కడా పొందుపరచలేదు.
- ఈ కళాశాలలో అధ్యాపకులకు సంబంధించి యూజీసీ కేర్ లిస్ట్‌లో కానీ, స్కోపస్ లాంటి ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధన పత్రాలు మచ్చుకైనా కనిపించవు.
- ఒక్కో సెక్షన్‌కు రెండు గదులు, ఒక ల్యాబ్ ఉండాలి. ఈ కళాశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం కనీసం 30 తరగతి గదులు ఉండాలి. కానీ 25 మాత్రమే ఉన్నాయి.
- ఒక్కో తరగతి గది 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలి. అంతే పరిమాణంలో ల్యాబ్‌లు ఉండాలి. కనీసం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నవి ఎనిమిది గదులు మాత్రమే. మిగతా గదులు కనీసం 400 చదరపు అడుగులు కూడా లేకపోవడం విశేషం. ఇక ఆయా కోర్సుల అవసరమైన లైసెన్సు పొందిన సాఫ్ట్‌వేర్ ఉండాలి. కంప్యూటర్ సైన్స్, కామర్స్ తదితర కోర్సులకు వాడుతున్న, అందిస్తున్న సాఫ్ట్‌వేర్లపైనా పలు అనుమానాలున్నాయి.

తొమ్మిది నెలల్లో ఎన్నో సంక్షేమాలు

- జిల్లాకు త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- పూర్తి స్థాయి రుణమాఫీ జరుగుతుంది
- హరీశ్‌రావు అసత్యాలు మాట్లాడుతున్నారు
- కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు
- 49 వేల ఉద్యోగాలిచ్చాం
- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

నిజామాబాద్ సిటీ : జిల్లా ప్రజలకు దసరా కానుకగా తీపి కబురుగా ప్రభుత్వం త్వరలోనే 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' మంజూరు చేయనుందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన జిల్లా కాంగ్రెస్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని, వాటి అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. ఇప్పటికే దాదాపు 49 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రైతు రుణమాఫీపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, రుణమాఫీపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు చేయడం తగదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ కాలంలో రైతుల కోసం ఖర్చు చేసిన నిధులెన్ని.. 9 నెలల కాంగ్రెస్ పాలనలో రైతు రుణమాఫీ కోసం చేసిన నిధులెన్నో ప్రజలు గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా సెన్స్ లేని మీడియాగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే సిలిండర్ వంటి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మేనిఫెస్టోలో లేని హామీలను కూడా కేవలం రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల అప్పులు చేసిందని, వాటికి రూ. 12 వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేశాం.. ఇప్పుడు అభివృద్ధి వైపు దృష్టి పెడదామన్నారు. నిజామాబాద్ ఎంపీ కేంద్ర నిధులు పూర్తిగా మంజూరు చేయించి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు సత్వరం నిర్మాణం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాకు రావాల్సిన స్మార్ట్ సిటీని తీసుకువచ్చేలా ఎంపీ అర్వింద్ కృషి చేయాలన్నారు.


జిల్లాకు మరో మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, స్టేడియం, నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడం, కాళేశ్వరం ప్యాకేజీ 20, 21 పనుల పూర్తి వంటి వాటిపై తాము దృష్టి పెడతామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. కులగణన పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత క్రమశిక్షణ ఉంటుందని, మంత్రి కొండా సురేఖ అంశం, బాన్సువాడలో కాంగ్రెస్ ఇన్‌చార్జిలెవరు? అనే పలు అంశాలు తన దృష్టికి వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌ను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, నుడా చైర్మన్ కేశ వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆర్మూర్ ఇన్చార్జి వినయ్ రెడ్డి, సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, జావేద్ అక్రమ్, రాంభూపాల్, సేవాదళ్ సంతోష్, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి

దసరాకు ఫుల్‌గా తాగేశారు

- ఉమ్మడి జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు



ఖలీల్‌వాడి : దసరాకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రజలు పండుగకు రెండు, మూడు రోజుల ముందుగానే గ్రామాలకు చేరకోవడంతో స్నేహితులు, బంధువులతో కలిసి మద్యం తాగారు. మద్యం ప్రియులు మద్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. గతేడాది కంటే ఈసారి మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలోని 151 మద్యం దుకాణాలు, 21 బార్లు ఉన్నాయి. శనివారం దసరా రావడంతో ఉపవాసాలు ఉన్నవారు పండుగను కొందరు శుక్రవారం, మరికొంత మంది ఆదివారం చేసుకున్నారు. ఈ మూడు రోజుల్లో ఐఎంఎల్ డిపో నుంచి మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. శనివారం పండుగ సందర్భంగా డిపో బంద్ ఉంది. కాగా అంతకు ముందు మూడు రోజుల్లో డిపో నుంచి రూ.21.48 కోట్ల విలువైన మద్యం వైన్‌షాపులు, బార్లకు తీసుకెళ్లారు.

ఐఎంఎల్ డిపోలో మద్యం విక్రయాల వివరాలు..

రోజు	లిక్కర్ (కేసుల్లో)	బీర్లు (కేసుల్లో)	ఆదాయం (రూ.)
బుధవారం	5,063	9,574	5,48,00,000
గురువారం	4,598	9,211	5,12,00,000
శుక్రవారం	10,412	17,803	10,88,00,000

ఆర్మూర్‌లో ఉద్రిక్తత



ఏసీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూత్ సభ్యులు, బీజేపీ నాయకులు

- దుర్గామాత శోభాయాత్రకు చెందిన సౌండ్ సిస్టం తీసుకెళ్లిన పోలీసులు
- ఆందోళన చేసిన భవానీ మాలధారులు, బీజేపీ నాయకులు

ఆర్మూర్ : ఆర్మూర్‌లో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టంను పోలీసులు స్టేషన్‌కు తరలించడంతో భవానీ స్వాములు, బీజేపీ నాయకులు ఏసీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వివరాలు.. జిల్లాలో సీపీ ఆదేశాల మేరకు డీజే సౌండ్ నిషేధించారు. అయితే నిబంధనలకు లోబడి పట్టణంలోని త్రిపుర యూత్ క్లబ్ సభ్యులు అమ్మవారి శోభాయాత్రలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించక ముందే పోలీసులు వచ్చి సీజ్ చేశారు. దీంతో త్రిపుర యూత్ క్లబ్ సభ్యులు, బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి నిబంధనల ప్రకారం సౌండ్‌సిస్టమ్ ఏర్పాటు చేశామని వాటిని తిరిగి ఇవ్వాలని కోరారు. ఏసీపీని అడిగి తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పడంతో ఆగ్రహంతో దుర్గామాత విగ్రహాన్ని ఏసీపీ కార్యాలయం ఎదుట ఉంచి ధర్నా చేశారు. పోలీసులు సముదాయించిన వినలేదు. దీంతో పోలీసులు సౌండ్‌సిస్టం తిరిగి ఇచ్చారు. దీంతో యూత్ సభ్యులు వెళ్లిపోయారు.

కొత్త టీచర్లకు నేడు కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్ : డీఎస్సీ ద్వారా టీచర్ కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి, స్థానాలను కేటాయించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 103లో ఎస్జీటీలు, భాషా పండితులు, పీఈటీలకు, రూమ్ నంబర్ 117లో స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. 464 మంది టీచర్లకు ఈ జాబితాలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.



డీఈవో కార్యాలయానికి వచ్చిన అభ్యర్థులు

ఎస్జీటీల బదిలీలకు మోక్షం

జిల్లాలో ఇటీవల బదిలీ అయి రిలీవ్ కాని ఎస్జీటీలకు మోక్షం లభించనుంది. కొత్త టీచర్లు రానుండటంతో వారిని రిలీవ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 260 మంది ఉపాధ్యాయులు రిలీవ్ కానున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

డీఎస్సీ నియామకాలకు సంబంధించి సోమవారం కూడా పలువురు అభ్యర్థులు ఫిర్యాదులు చేశారు. కళావతి అనే అభ్యర్థి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు. ఆమె స్కూల్ అసిస్టెంట్ కావాలని ఎస్జీటీ అవసరం లేదని విద్యా శాఖ అధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. అయితే తాజాగా నిబంధనలు మారాయని చెప్పి స్కూల్ అసిస్టెంట్ పోస్టులో ఈమెకు బదులు మరొకరికి ఇచ్చారు. దీంతో కళావతి రెండు ఉద్యోగాలకు దూరమయ్యారు. దీనిపై సోమవారం జిల్లా విద్యాశాఖ సంప్రదించగా సమస్యను మళ్లీ పరిష్కరిస్తామని తెలిపారు. డిచ్‌పల్లికి చెందిన సుహాసిని అనే మరో అభ్యర్థి స్కూల్ అసిస్టెంట్ విభాగంలోని 314 ర్యాంకు పొందింది. వికలాంగుల విభాగంలో ఆమెకు రావాల్సిన ఉద్యోగాన్ని పురుష అభ్యర్థికి కేటాయించారు. దీంతో ఆమె డీఈవో, కలెక్టర్‌కు విన్నవించింది. దీనిపై మంగళవారం పరిశీలన చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు ప్రముఖుల దసరా శుభాకాంక్షలు

నిజామాబాద్‌అర్బన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం పలువురు ప్రముఖులు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. బోధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పి సుదర్శన్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిశారు.

జిల్లా హాకీ సీనియర్ క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో జిల్లా సీనియర్ పురుషుల హాకీ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశాఖ గంగారెడ్డి, సదమస్తుల రమణ సోమవారం తెలిపారు. మొత్తం 40 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ కనబర్చిన 18మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడకారులు త్వరలో తెలంగాణ హాకీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే అంతర్ జిల్లాల హాకీ టోర్నీలో పాల్గొంటారన్నారు. హాకీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మహ్మద్ ఆరిఫ్, సడక్ నగేశ్, పరంజ్యోతి, సీనియర్ కీడాకారులు పాల్గొన్నారు.

'ఖేలో ఇండియా'కు ఎంపిక



నిజామాబాద్ నాగారం: తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ టోర్నమెంట్‌కు బాల్కొండ కేజీబీవీ విద్యార్థిని ఏలేటి మైథిలి ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, ఎండీ అతీకుల్లా సోమవారం తెలిపారు. మైథిలిని ఉమ్మడి జిల్లా ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ బిల్లా అనిల్, కోశాధికారి నోముల మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరరావు అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: ఓ వ్యాపారి అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. పాల్వంచమర్రికి చెందిన వ్యాపారి నంగునూరు శ్రీనివాస్ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశాడనే సమాచారం మేరకు దాడి చేసి 11క్వింటాళ్ల 10కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరద కోసం వర్రీ ఎందుకు?

- ఎగువ నుంచి ఎస్సారెస్పీలోకి భారీ ఇన్‌ఫ్లో
- ఈ ఏడాది ఇప్పటి వరకు 246 టీఎంసీల వరద



నిండుకుండలా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఆశించిన దానికన్నా ఎక్కువే వరద వస్తోంది. ఈ ఏడాది సైతం ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి 246 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఇది ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి మూడు రెట్లు ఎక్కువ. గడచిచిన దశాబ్ద కాలంగా ఏ సంవత్సరం కూడా ఎగువ నుంచి వరద రాక ఢోకా లేకుండాపోయిందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాజెక్ట్ ఎగువన మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్ట్ నిర్మించినప్పటికీ సుప్రీం కోర్టు తీర్పు కారణంగా వరదకు బ్రేక్ పడలేదు. మహారాష్ట్ర ప్రాంతంలోని గైక్వాడ్, విష్ణుపురి, మాలేగావ్, అముదురా, బాబ్లీ ప్రాజెక్ట్‌ల నుంచి వరద వస్తోంది.

2015లో నిల్

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం 1978లో పూర్తి కాగా, నాటి నుంచి ప్రతి సీజన్‌లో వరద నీరు వస్తోంది. 1984లో ప్రాజెక్ట్ చరిత్రలోనే అత్యధికంగా వెయ్యి టీఎంసీల కన్నా ఎక్కువ ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ చరిత్రలో 1988లో, 2015లో మాత్రమే ఎగువ నుంచి చుక్కనీరు రాక ప్రాజెక్ట్ నీటిమట్టం డెడ్ స్టోరేజీ కంటే తక్కుకు పడిపోయింది. 2015 నుంచి ఇప్పటి వరకు 2017లో 75 టీఎంసీలు, 2018లో మాత్రం 83 టీఎంసీల వరద వచ్చిచేరింది. ఆ రెండు సంవత్సరాలు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి మిగులు జలాలను విడుదల చేయనప్పటికీ ఆయకట్టుకు రెండు పంటలకు నీటిని సరఫరా చేశారు.

రివర్స్ పంపింగ్ ఉన్నా..

ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో రాకపోతే కాళేశ్వరం నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా తీసుకువచ్చేందుకు ఎస్సారెస్పీ పనరుజ్జీవన పథకాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. రోజుకు టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 60 టీఎంసీల నీటిని తీసుకువ్చి ప్రాజెక్ట్ నింపాలనే లక్ష్యంతో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకాన్ని చేపట్టారు. 2017లో పనులను ప్రారంభించి 2019లో పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ అవసరం రాలేదు. 2023లో ప్రయోగాత్మకంగా 2.5 టీఎంసీల నీటిని మాత్రం ప్రాజెక్ట్‌లోకి తరలించారు. అంతలోనే ఎగువ నుంచి భారీ వరద రావడంతో రివర్స్‌పంపింగ్‌ను నిలిపివేశారు.

గత ఐదేళ్లలో ఇన్‌ఫ్లో..

సంవత్సరం	టీఎంసీలు
2020	371
2021	682
2022	595
2023	209
2024	246

(ఇప్పటి వరకు)

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం 8,590 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500, వరద కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉందని ఏఈఈ రవి తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

జిల్లాలో పోలీసు బదిలీలు

- ఏఎస్సైలు ఆరుగురు.. హెడ్ కానిస్టేబుళ్లు 12 మంది
- కానిస్టేబుళ్లు 73 మంది



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో పలువురు సిబ్బందిని బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లోని పని చేస్తున్న ఆరుగురు ఏఎస్సైలు, 12మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 73 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌లో భాగంగా బదిలీలు జరిగినట్లు శాఖవర్గాల ద్వారా తెలిసింది. రెండేళ్ల క్రితం జిల్లాలో అప్పటి సీపీ కేఆర్ నాగరాజు పెద్ద సంఖ్యలో సిబ్బందిని బదిలీ చేశారు.అయితే కొంత మంది నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఏఎస్సైలు వివిధ పోలీస్‌స్టేషన్‌లలో మూడేళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు నాలుగేళ్లు పని చేయాల్సి ఉంటుంది. కానీ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా బదిలీలు చేశారు.

బదిలీ అయిన ఏఎస్సైలు

పేరు	ప్రస్తుత పోస్టింగ్	బదిలీ స్థానం
కె రవీందర్	బోధన్‌రూరల్	సిరికొండ
రహమాన్	ని.రూరల్	కోటగిరి
లక్ష్మణ్‌నాయక్	ని.టూ టౌన్	ఏర్గట్ల
శ్రీనివాస్‌గౌడ్	కోటగిరి	ని.5 టౌన్
కె గంగాధర్	ఏర్గట	రుద్రూర్
చిరంజీవి	భీమ్‌గల్	బోధన్ టౌన్

హెడ్ కానిస్టేబుళ్లు

పేరు	ప్రస్తుత పోస్టింగ్	బదిలీ స్థానం
టి పోతన్న	ని.వన్ టౌన్	కమ్మర్‌పల్లి
కె మల్లేశం	నవీపేట్	ముప్కాల్
బి అశోక్	నవీపేట్	బోధన్ టౌన్
జె మల్లేశ్	వేల్పూర్	వర్ని
జె నాగరాజు	ని.4 టౌన్	రుద్రూర్
పి సందీప్	ని.6 టౌన్	బోధన్‌టౌన్
వి శంకర్	కోటగిరి	మోర్తాడ్
జి శ్రీనివాస్	రెంజల్	ని.1 టౌన్
ఎస్ భాస్కర్	ఏర్గట్ల	బోధన్ టౌన్
ఎం రాజేశ్వర్	టాస్క్‌ఫోర్స్	నవీపేట్
బి సుదర్శన్	టాస్క్‌ఫోర్స్	వేల్పూర్
కె లస్మన్న	టాస్క్‌ఫోర్స్	భీమ్‌గల్

17న ఖోఖో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఈనెల 17వ తేదీన ఉమ్మడి జిల్లా ఖోఖో జిల్లా స్థాయి జూనియర్ బాయ్స్, గర్ల్స్ టోర్నమెంట్, సీనియర్ మెన్, ఉమెన్ ఎంపికలను నందిపేటలోని గీత కాన్వెంట్ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భూమారెడ్డి, ఎండీ అతీకుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల వివరాలను 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి నాగేశ్వరరావు(85559 96271, 73965 41233, 94942 59901)కు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. 17న ఉదయం 8 గంటలకు క్రీడాకారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

స్మార్ట్ సిటీతో నిజామాబాద్ అభివృద్ధి

- పూలాంగ్ ప్రక్షాళన జరగాలి
- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్



భవనాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగర అభివృద్ధి స్మార్ట్ సిటీతోనే మరింత వేగవంతమవుతుందని, అందుకు కృషి చేస్తామని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో రేణుకా ఎల్లమ్మ గౌడసంఘం భవనం పైఅంతస్తులను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తరువాత అంతా కలిసి నగర అభివృద్ధి దృష్టిసారిద్దామన్నారు. పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. నిజామాబాద్ తరువాత మున్సిపాలిటీలుగా మారిన కరీంనగర్, ఇతర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందాయన్నారు. రైల్వే బ్రిడ్జీలకు కేంద్రం నుంచి తగినన్ని నిధులు కేటాయించి వాటిని పూర్తిచేసేలా చూడాలని ఎంపీ అరవింద్‌కు సూచించారు. ఎల్లమ్మగుట్ట వద్దనున్న రైల్వే బ్రిడ్జిని త్వరలో పూర్తిచేస్తామన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో నిడ్రా రావాల్సిన అవసరం ఉందన్నారు. పూలాంగ్‌వాగు ప్రక్షాళన జరిగి తీరాల్సిందేనన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో పేదలు తమ ఇళ్లు నష్టపోతే వారికి నివాస స్థలం కల్పిస్తామన్నారు. నాలాలు ఆక్రమించిన బడాబాబులను మాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గౌడ సంఘం నిర్మాణానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ సమస్యలను స్థానిక కార్పొరేటర్ న్యాలం రాజు పీసీసీ చీఫ్ దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, కేశ వేణు, పంచరెడ్డి సుదర్శన్, మహ్మద్ ఖైసర్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌అర్బన్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను పులువురు గిరిరాజ్ కళాశాల పూర్వ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గిరిరాజ్ కళాశాల మాజీ అధ్యక్షుడు కోనేరు సాయికుమార్, సెక్రెటరీ సీతయ్య, కేశపురం రమేశ్, సాయిలు, నగేశ్, రాజు, హన్మాండ్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 51 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంద మకరంద్

నిజామాబాద్‌అర్బన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 51 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్ మకరంద్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ మకరంద్ అధికారులకు సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీ తాగేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ చౌరస్తావద్ద సోమవారం తెల్లవారు జామున 4గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో సుద్దపల్లి చిన్న గంగాధర్(55) అనే వ్యక్తి మృతిచెందాడు. పెర్కిట్ చౌరస్తాలోని హోటల్‌లో టీ తాగేందుకు గంగాధర్ బైక్‌పై వెళ్తుండగా వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

వాహనం అదుపుతప్పి..

నవీపేట: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన పాముల నవీన్(30) అనే వ్యక్తి మృతి చెందాడు. నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావ్ ఫారం దగ్గర బాసర రహదారిపై సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుందని ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. కోస్లి లిఫ్ట్ పక్కన ఉన్న సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నవీన్ పని నిమిత్తం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఘటనాస్థలంలో నవీన్ మృతదేహం

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని రామక్కపల్లికి చెందిన జోడు సాయిలు(42) సోమవారం రాత్రి మండలంలోని రాఘవపల్లితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయిలు టీవీఎస్ ఎక్సెల్‌పై రామక్కపల్లికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన సాయిలును ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పరిస్థితి విషమించి మహిళ..

- ఐసీయూలో భర్త పరిస్థితి విషమం

బాన్సువాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయాపాలుకాగా, చికిత్స పొందుతూ పరిస్థితి భార్య మృతి చెందింది. భర్త ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హన్మాజీపేటకు చెందిన భార్యభర్తలు మూడ భాగ్యలక్ష్మి, జనార్దన్ ఈనెల 11న గాలీపూర్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా తిర్మలాపూర్ సమీపంలో ఎల్లారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యభర్తలకు తీవ్రగాయాలు కాగా, బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. భాగ్యలక్ష్మి (40) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందగా, జనార్దన్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భాగ్యలక్ష్మి (ఫైల్)

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండడంతో ఓ మహిళ, అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన మరో మహిళ ఉరేసుకున్నారు. కూతురి పెళ్లికి అప్పులు చేసిన ఓ తండ్రి యంచ వద్ద.. భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త కందకుర్తి వద్ద గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో కూలీ పని చేసుకునే మరో యువకుడు అనారోగ్యం కారణంగా ఉరేసుకున్నాడు.

కూతురికి ఫోన్ చేసి గోదావరిలో దూకిన తండ్రి

నవీపేట: మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన జీవన్‌రెడ్డి(57) సోమవారం తెల్లవారు జామున యంచ వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటో నడుపుతూ జీవించే జీవన్‌రెడ్డి నాలుగేళ్ల కిందట కూతురు సవిత పెళ్లి కోసం అప్పు చేశాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురైన ఆయన తెల్లవారుజామున గోదావరి బ్రిడ్జి పైకి వచ్చి కూతురికి ఫోన్ చేశాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి గోదావరిలో దూకాడు. మృతుడికి భార్య లావణ్య, కొడుకు సంపత్‌రెడ్డి ఉన్నారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ..

బిచ్కుంద(జుక్కల్): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని వాజిద్‌నగర్‌కు చెందిన యెల్లుట్ల సుమలత(36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుమలత జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం దూలానికి ఉరేసుకుందన్నారు. మృతురాలి భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోతెకు చెందిన యువకుడు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన గాధం ప్రణీత్(20) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న ప్రణీత్, దసరా పండుగ కోసం స్వగ్రామానికి వచ్చాడని, కొంత కాలంగా కడుపునొప్పి, అనారోగ్యంతో బాధపడుతున్న అతడు, రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రణీత్ (ఫైల్)

భార్య మరణాన్ని జీర్ణించుకోలేక..



మీసాలే లక్ష్మణ్ (ఫైల్)

రెంజల్(బోధన్): భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలం ఖండ్గాం గ్రామానికి చెందిన మీసాలే లక్ష్మణ్(26) భార్య ఆరు నెలల క్రితం మృతి చెందింది. ఇద్దరు పిల్లలతో సాటాపూర్‌లో ఉంటున్న బావ వద్దకు వచ్చిన లక్ష్మణ్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. భార్య మరణంతో మనస్తాపానికిగురైన లక్ష్మణ్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. శనివారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన లక్ష్మణ్ తిరిగిరాకపోవడంతో అతడి బావ ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నది ఒడ్డున వాహనం నిలిపి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఆ వాహనం లక్ష్మణ్‌ది అని నిర్ధారించారు. గోదావరిలో గాలించినప్పటికీ లక్ష్మణ్ ఆచూకీ లభించలేదు. సోమవారం నదిలో మృతదేహం కనిపించడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జాలార్లతో మృతదేహాన్ని బయటకు తీయించిన పోలీసులు లక్ష్మణ్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

భర్త వేధింపులు తాళలేక..



మనోజ(ఫైల్)

ఇందల్వాయి: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండడంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చంద్రాయన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సదాశివనగర్ మండలం గిద్ద గ్రామానికి చెందిన వేముల మనోజకు డిచ్‌పల్లికి చెందిన సాయిలుతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. డ్రైవర్ అయిన సాయిలు కొద్ది కాలంగా వివిధ రకాల వాహనాలు నడుపుతూ చంద్రాయన్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. సాయిలు మనోజని అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి విద్యాగనర్‌లో ఆదివారం అర్ధరాత్రి వరుణ్ అనే యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గామాత శోభాయాత్రలో వరుణ్ ఓ యువతిని టీజ్ చేశాడు. ఇదివరకే నిశ్చితార్థం అయిన ఆ యువతి తనకు కాబోయే భర్తకు విషయం తెలిపింది. అక్కడికి చేరుకున్న యువతికి భర్త శోభాయాత్రలో నృత్యం చేస్తున్న వరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. గాయలపాలైన వరుణ్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన యువకుడిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వర్ని: చందూర్ గ్రామ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సోమవారం సాయంత్రం సమాచారం అందించారని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 28 ఏళ్లు ఉంటుందని, బ్లాక్ కలర్ ప్యాంటు, ఎల్లో కలర్ షర్ట్ ఉందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

డీజే నిర్వాహకులపై కేసు

బోధన్‌టౌన్(బోధన్): పోలీసుశాఖ నిబంధనలకు విరుద్ధంగా దేవీమాత శోభాయాత్రలో డీజేలు ఏర్పాటు చేసిన భారత్, ఎంఎస్ డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం నిర్వహించిన దేవీమాత శోభాయాత్రలో డీజే ఏర్పాటు చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

తాళం వేసిన నాలుగు ఇళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఆర్మూర్‌టౌన్: పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి కేవీఆర్ కాలనీలో తాళం వేసిన నాలుగు ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రాంనగర్‌కు చెందిన రవికుమార్, బోల్ల రఘునాథ్, బోల్ల మాధవి, మామిడిపల్లికి చెందిన మరో కుటుంబం ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లారు. ఆ ఇళ్ల తాళాలను పగులగొట్టిన దుండగులు.. బోల్ల మాధవి ఇంట్లో నుంచి రెండు తులాల బంగారం, రూ. 50వేల నగదు, పక్కనే ఉన్న బోల్ల రఘునాథ్ రూ.2లక్షల నగదు, ఏడు తులాల బంగారం, ఐదు తులాల వెండి ఎత్తుకెళ్లారు. రవికుమార్ అనే వ్యక్తి ఇంటితోపాటు మామిడిపల్లిలోని మరో ఇంట్లో దుండగులకు ఏమీ లభించలేదు. పోలీసులు బాధితుల ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

మాచాపూర్‌కు చెందిన ఒకరి అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన మాచబోయిన సాయిలు (42) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. పొలం వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన సాయిలు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. సాయిలు ఆచూకీ లభించకపోవడంతో అతడి కూతురు మౌనిక ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



సాయిలు

జిల్లాకేంద్రానికి చెందిన మహిళ..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కెంగర్ల నిర్మల అనే మహిళ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మతిస్థిమితం లేని నిర్మల ఈనెల 7న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో ఆమె తండ్రి మల్లయ్య పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.



కెంగర్ల నిర్మల

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్..

రుద్రూర్ : పొతంగల్ మండలం జల్లాపల్లి, కోటగిరి మండలం లింగాపూర్ శివార్లలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో నుంచి దుండగులు ఆదివారం రాత్రి కాపర్ కాయిల్స్ ఎత్తుకెళ్లారు. జల్లాపల్లి శివారులో ఒకటి, లింగాపూర్ శివారులో రెండు వ్యవసాయ భూముల్లో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు కిందపడేసి చోరీకి పాల్పడ్డారన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ నర్సారెడ్డి తెలిపారు.

సర్వీస్ రోడ్డుపై లారీ బోల్తా

రామారెడ్డి: రామారెడ్డి గంగమ్మ వాగు సర్వీస్ రోడ్డు మీదుగా కామారెడ్డి వైపు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం రామారెడ్డి శివారులో గంగమ్మ వాగు వద్ద సోమవారం చోటుచేసుకుంది. లారీ మట్టి రోడ్డుపై నుంచి వెళ్లడంతో మట్టి రోడ్డు కుంగిపోయి లారీ బోల్తా కొట్టింది. రామారెడ్డి నుంచి గర్గుల్ వచ్చే దారిలో గంగమ్మ వాగు ప్రమాదకరంగా ఉండటంతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు.